క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

కనగానపల్లి: పచ్చదానాన్ని పెంపొందించే మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుదామని పెనుకొండ డివిజన్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫారెస్టు అధికారులు ఆధ్వర్యంలో పర్యావరణ వారోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధిహామీ సిబ్బందితో కలసి మొక్కలు పెంపకం, వాతావరణ పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తనకల్లు: మండల పరిధిలోని కొర్తికోటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్న రెడ్డెప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసుల రెడ్డి శుక్రవారం మృతుని కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు గంగప్పనాయుడు, కొండకమర్ల ముస్తఫా, మోహన్, నాగముని, అమర్‌నాథ్‌రెడ్డి, రమణప్పనాయుడు, లక్ష్మీపతి, జనార్ధన్‌నాయుడు, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలతో ప్రచారం



ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు సాధించిన మార్కులతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ధర్మవరం రూరల్: ర్యాంకులు అంటే ప్రైవేటు విద్యా సంస్థలకే సాధ్యం. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు సర్కారు బడులు, కళాశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. ఎంతలా అంటే ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రచారం చేసేంతలా విద్యార్థులు మార్కులు సాధించారు. ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినుల ఫొటోలతో కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2023–2024 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 25 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11న రాతపరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 7032996416లో సంప్రదించాలన్నారు.

హంద్రీ–నీవా పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కదిరి టౌన్: హంద్రీ–నీవా పనులు సత్వరం పూర్తి చేసి, సాగు తాగునీరు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీసత్యసాయి జిల్లాలో రైతులందరూ ఇప్పటికే బెంగళూరు, చెన్నై, కేరళ, హైదరాబాద్ రాష్ట్రాలకు వలస బాట పట్టారన్నారు. హంద్రీ–నీవా పనులు సత్వరమే పూర్తిచేసి దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగునీరు తాగునీరు అందించాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచక పోవడంతో వలస కూలీల సంఖ్య పెరిగిపోతుందని తెలిపారు. అకాల వర్షాలకు నష్టపోయిన మామిడి, చీనీ, అరటి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కదిరప్ప, ఇషాక్, మధునాయక్, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

కొత్తచెరువు: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. సెంటర్‌కు వచ్చే గుడ్లు, పోషకాహారాన్ని పరిశీలించారు. ప్రతి నెలా లబ్ధిదారులకు వచ్చే కిట్లు బాలామృతం, పోషక పదార్థాల కిట్లను సక్రమంగా అందిస్తున్నారా? అని పిల్లల తల్లులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సెంటర్లలో అందించే భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రతి సెంటర్‌లోనూ రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. సక్రమంగా సెంటర్లను నిర్వహించాలని సూచించారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది

- పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే ఓర్వలేకపోతున్నారు
- సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం
- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



కదిరిటౌన్: పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



పుట్టపర్తి టౌన్: బ్రిడ్జి ఏరియాలో మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కదిరి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పేదలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌ను చూసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓర్వలేక పోతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా ప్రభుత్వం ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ టీడీపీ నేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడి అప్రజాస్వామిక, అహంకారపూరిత వ్యాఖ్యలను నిరసిస్తూ రెండు రోజుల పాటు అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాం

కదిరి టౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఆ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూసేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు సచివాలయం పరిధిలోని నాగిరెడ్డి పల్లి, బేరిపలి, బేరిపలిలో క్వాటర్స్‌లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అంటూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పలు సమస్యలకు పరిష్కారం చూపారు. పరిష్కారం కాని సమస్యలను పై అధికారులతో మాట్లాడి త్వరితగతిత పరిష్కరించాలని ఆదేశించారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు వేయించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కడెక్కడ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు అవసరమో గుర్తించి, వెంటనే ఎస్టిమేషన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ పోల్స్ వేయించాలని పలువురు కోరగా.. అవసరమైన చోట్ల పోల్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షం బురద చల్లే కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని తెలిపారు. ప్రజలు రాబోయే రోజుల్లో జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ సమన్వయ కర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి, వాల్మీకి పాఠశాల అధినేత అనిల్ కుమార్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ పి.హరిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాధిక్ బాషా, ఇలాహి, దాదాపీర్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, సింగల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో నవరత్నాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి ఇంటిలో సంక్షేమ కాంతులు నింపుతోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీలోని పెద్ద బజార్ సచివాలయం పరిధిలో చిత్రావతి బ్రిడ్జి సర్కిల్ ఏరియాలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ గడిచిన నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. తమకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 90 శాతం ప్రజలు సంక్షేమ పథకాలపై సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రాబోవు రోజుల్లో మరింత సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు.విద్యార్థులకు అమ్మఒడి రైతులకు రైతుభరోసా, మహిళలకు వైఎస్సార్ చేయూత, ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో పాటు ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారని వెల్లడించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తుంటే.. దీన్ని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, దోచుకోవడంపై దృష్టి సారించారన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రజలే టీడీపీ నాయకులపై తిరగబడతారన్నారు. టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. 2024లో టీడీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, పుడా చైర్మన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మెన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సాయిలీల, పట్టణ, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, సాయిలీల, సూర్యాగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

నేడు 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'పై సమీక్ష

నల్లమాడ: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 9 గంటలకు యర్రవంకపల్లి, 9:30 గంటలకు కొండకింద తండా, 10 గంటలకు వేళ్లమద్ది, 10:30 గంటలకు చారుపల్లి, 11 గంటలకు వంకరకుంట, 11:30 గంటలకు రెడ్డిపల్లి, 12 గంటలకు పాతబత్తలపల్లి, 12:30 గంటలకు పులగంపల్లి, ఒంటి గంటకు దొన్నికోట, 2 గంటలకు మసకవంకపల్లి, 2:30 గంటలకు కురుమాల, 3 గంటలకు గోపేపల్లి, 3:30 గంటలకు పెమనకుంటపల్లి తండా, సాయంత్రం 4 గంటల నుంచి నల్లమాడ (టౌన్) పంచాయతీలకు సంబంధించి సమీక్ష నిర్వహించనున్నారు. హౌసింగ్ ఉన్నతాధికారులు పాల్గొనే సమావేశంలో మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకొంటారన్నారు. సమావేశానికి గృహ నిర్మాణ శాఖ అధికారులు పూర్తి సమాచారంతో రావాలని పేర్కొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన

నల్లచెరువు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నిల్వ ఉంచిన జగనన్న విద్యాకానుక కిట్లను శుక్రవారం ఎంపీడీఓ శకుంతల, డీపీఓ విజయకుమార్‌రెడ్డి, ఎంఈఓ తిరుపాల్ నాయక్ పరిశీలించారు. స్కూల్ మెటీరియల్, బెల్టుల నాణ్యతను తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ యూనిఫాం 2,889, బెల్టులు 2,123 కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కదిరి టౌన్: పట్టణంలోని రహదారుల భవనాల అతిథి గృహంలో సిద్ధేశ్వరం అలుగు జలజాగరణ దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం రాయలసీమ సాగునీటి సాధన సమితి సభ్యులు చింతా శరత్‌కుమార్ రెడ్డి, దశరథరామిరెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 31న చేపట్టే సీమ జలజాగరణ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, సోమశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి



మాట్లాడుతున్న జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల ఇన్‌చార్జ్ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి

తనకల్లు: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల ఇన్‌చార్జ్ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తవళం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. విధుల్లో అంకిత భావంతో పని చేయాలన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం రత్నేనాయక్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి కోసం కుళాయిలను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ పూల నరసింహులును ఆదేశించారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి



కనగానపల్లిలో విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ కృష్ణకుమారి

అమడగూరు/ఓడీ చెరువు/ముదిగుబ్బ: విత్తన వేరుశనగకు రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారులు జ్యోత్స్న, ఇలియాజ్, లక్ష్మీనరసింహులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం, మొబైల్ తీసుకుని సంబంధిత రైతు భరోసా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుని రసీదు పొందాలన్నారు. తర్వాత రసీదు మేరకు కాయలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రాయితీ పోగా 30 కేజీల కే6 ధర రూ.1,674, అలాగే లేపాక్షి 1812 ధర రూ.1,494 ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ నెలాఖరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు వేరుశగన కాయలను అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనగానపల్లి: ప్రభుత్వం రాయితీతో అందించే విత్తన వేరుశనగకు రైతులు ఆర్బీకేలలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ కృష్ణకుమారి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్బీకేలో విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. వచ్చే ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తన కాయలు అందిస్తోందన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. కనగానపల్లి మండలానికి తొలి విడతగా 2005 క్వింటాల్ విత్తనం కేటాయించారని, ఇప్పటి వరకు 10 ఆర్బీకేల పరిధిలో 165 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వీఎస్‌ఏ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేయాలి



రాధాబాయిని పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

కదిరి అర్బన్: గిరిజన విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి, ఆమె తల్లిని కులం పేరుతో దూషించిన ముదిగుబ్బ ఎస్‌ఐ హేమంత్ కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో బుక్కా రాధాబాయిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుక్కా రాదాబాయి భర్త తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం శిక్షించవచ్చన్నారు. ఇంటికి వెళ్లి మైనర్ కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. బాలికను లైంగికంగా వేధించడంతో పాటు ఆమె తల్లిని కులం పేరుతో దూషించడం అన్యాయమన్నారు.ఎస్‌ఐ హేమంత్‌కుమార్ కదిరి పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇద్దరు కానిస్టేబుళ్లు, మరొక ప్రైవేటు వ్యక్తిని తీసుకుని రాధాబాయి ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేయడం తగదని చెప్పారు. ఈ ఘటనపై విచారణ చేసి అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఎస్పీ శ్రీలతను ఎస్టీ కమిషన్ సభ్యుడు సంప్రదించగా.. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందలేదని సమాధానం ఇచ్చారు. విచారించి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అమడగూరు: మండలంలోని గాజుబండ సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓసీ, బీసీ కులాల వారు రూ.200, ఎస్సీ, ఎస్టీ కులాల వారు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్థానిక మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ గొర్రెల కాపరి మృతి

ముదిగుబ్బ: మండల పరిధిలోని ముక్తాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు (50) అనే గొర్రెల కాపరి కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం గొర్రెల వద్దకు వెళ్లిన శ్రీనివాసులు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి గొర్రెల కాపరులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భార్య ముత్యాలమ్మ తెలిపారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

ఎన్పీకుంట: స్థానిక ఎన్.పీ.కుంట–1 సచివాలయ ఆవరణంలో శనివారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఎంపికై న వలంటీర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రామగిరి: మండల కేంద్రంలో శనివారం నుంచి 29 నుంచి వారం రోజుల పాటు వలంటీర్లను సన్మానం చేయనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 11 సచి వాలయాలు ఉండగా, శనివారం గంతిమర్రి పంచాయతీలోని వలంటీర్లు, 26న రామగిరి వలంటీర్లను సన్మానించనున్నట్లు తెలిపారు.

వాహనాల వేలం

తలుపుల: మండలంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ రామమోహన్, ఎస్‌ఐ మగ్బుల్ బాషా ఆధ్వర్యంలో 5 ద్విచక్ర వాహనాలు ఒక కారుకు వేలం పాట నిర్వహించారు. రూ.1.17 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

ఇసుక రీచ్ రద్దు చేయాలి

బత్తలపల్లి: దంపెట్ల, ఉప్పర్లపల్లి సమీపాన చిత్రావతి నదిలో ఇసుక రీచ్ అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం ఇసుక రీచ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు తెలుసుకున్న దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకర్‌నాయుడు, సీపీఐ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ యుగేశ్వరి దేవి, సర్పంచు చల్లా కరుణాకర్ నాయుడు, రెవెన్యూ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. ఇసుక తరలింపును ఆపాలని వీఆర్‌ఓ నరసింహులు, వీఆర్‌ఏలను ఆదేశించారు. అనంతరం రైతులతో కలిసి అధికారులు ఇసుక రీచ్ వద్ద టిప్పర్లను అడ్డుకున్నారు.

జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధికార ప్రతినిధిగా హనుమంతు

ఓడీ చెరువు: జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధికార ప్రతినిధిగా ఓడీ చెరువుకు చెందిన న్యాయవాది మారేపల్లి హనుమంతును నియమిస్తూ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం చైర్మన్ తూము రామచంద్రనాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీ.ఎస్.కృష్ణారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధికార ప్రతినిధిగా నియమించినందుకు హనుమంతు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కదిరి టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పట్నం పంచాయతీ పరిధిలోని మాచిరెడ్డిపల్లికి చెందిన చిన్నపరెడ్డి గారి బసిరెడ్డి (57) మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు... శుక్రవారం రాత్రి రైతు చిన్నపరెడ్డి గారి బసిరెడ్డి పనిమీద కదిరికి వచ్చాడు. తిరిగి బస్టాండ్‌కు వెళ్తుండగా.. ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన అతడిని కదిరి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ధర్మవరం రూరల్: చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. గత రెండు రోజులుగా కళ్యాణదుర్గంలోని జ్ఞాన భారతి జూనియర్ కళాశాలలో అండర్–19 స్కూల్ గేమ్స్, రాష్ట్రస్థాయిలో జూడో పోటీల్లో చిగిచెర్లకు చెందిన మహిత, శ్రీనిత్య, నికితలు ప్రతిభ కనబరిచారు. దీంతో వారు జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ట్లు పీడీ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 52 కేజీల విభాగంలో మహిత బంగారు పతకం, 48 కేజీల విభాగంలో శ్రీనిత్య రజత పతకం, 36 కేజీల విభాగంలో నికిత బంగారు పతకం సాధించినట్లు పేర్కొన్నారు. జూన్ 9 నుంచి 14 వరకు భోపాల్, మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ జూడో స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికై న విద్యార్థినులను గ్రామస్తులు , పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు ప్రతాప్, నాగార్జున తదితరులు అభినందించారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



ధర్మవరం రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య ఫొటోకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య ఫొటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశంలో దళిత గిరిజన, మైనార్టీ రైతులు, కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఉద్యమాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు, సీఐటీయు నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఆదినారాయణ, రైతు సంఘం నాయకులు మారుతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున, హరి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓడీ చెరువు: కార్మిక జీవుల కోసం సుందరయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు కొనియాడారు. ఓడీ చెరువులో శుక్రవారం 38వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రమణ నాయకులు కుళ్లాయప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్ నరసింహులు, సుబ్బిరెడ్డి, రామ్మోహన్, బాబ్జాన్, శాంతిబాయి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

కొత్తచెరువు: మండల పరిధిలోని ఇళ్ళ వెంకటంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, స్టోర్ డీలర్ హనుమంత రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని మృతుడి భార్య లక్ష్మీదేవికి హామీ ఇచ్చారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా తలమర్లలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు మటన్ శంకర్, ఉపసర్పంచ్ రాంభూపాల్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి, మీర్జాపురం సర్పంచ్ చెన్నారెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.